క్లుప్తంగా

బడిబయటి పిల్లల్ని గుర్తించండి



ఉపాధ్యాయులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు: ఉపాధ్యాయులు బడి బయటి పిల్లల్ని సెలవు దినాల్లో గుర్తించి స్కూళ్లలో చేర్పించడానికి చొరవ చూపాలని ఎంఈఓ కే.రవి కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ, నాడు-నేడులో రెండో విడత మంజూరైన పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రతి వారం ఆ పనులకు సంబంధించిన ఫొటోలను జిల్లా అధికారులకు అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వం అందజేసిన ×సెలవుల్లో సరదాగా× సమ్మర్ క్యాంప్ (టీచింగ్ ఎట్ ద రైట్ లెవల్) పుస్తకాలను ఉపాధ్యాయులకు ఎంఈఓ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూసార పరీక్షతో అధిక దిగుబడులు



కరదీపికను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీలు, ఏఓలు

పిచ్చాటూరు: రైతులు పంటల సాగుకు పూనుకోవడానికి ముందు భూసార పరీక్షలు చేసుకోవడం ఉత్తమమని వ్యవసాయ శాఖ ఏడీ రమేష్ రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో డివిజన్ స్థాయి రైతు భరోసా ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు, వీఏఏలు నిర్వర్తించాల్సిన విధులు-బాధ్యతలను తిరుపతి సహాయ వ్యవసాయ సంచాలకులు మణి వివరించారు. అనంతరం భూసార పరీక్షలు-ఎరువుల యాజమాన్యం అనే కరదీపికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఓలు సంజీవ రెడ్డి, శ్రీనివాసులు, సుబ్బారావు డివిజన్‌లోని అన్ని మండలాల ఏఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న దేవరి

ఏర్పేడు: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ దేవరి కోరారు. సోమవారం మండలంలోని పాతవీరాపురంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ, జీవనజ్యోతి కింద 18 నుంచి 50 ఏళ్లలోపు వ్యక్తులు ఏడాదికి రూ.436 చెల్లిస్తే సహజ మరణం, ప్రమాద బీమా కింద రూ.2 లక్షలు పొందవచ్చని సూచించారు. ప్రధానమంత్రి జీవన సురక్ష కింద 18 నుంచి 70 ఏళ్లలోపు వ్యక్తులు ఏడాదికి రూ.20 చెల్లించాలని చెప్పారు. ప్రమాద బీమా కింద రూ.2 లక్షలు నగదు కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయకుడు మనోహర్, కూలీలు పాల్గొన్నారు.

రేణిగుంట రూరల్ సీఐగా సుబ్బరాయుడు



రేణిగుంట: రేణిగుంట రూరల్ సీఐగా బి.సుబ్బరాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఫ్రెండ్లీ పోలీసింగ్, శాంతిభద్రతలను పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తానని ఆయన చెప్పారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు, కాంపాళెం గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, కాటూరు, ఆదిరెడ్డికండ్రిగ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో పనిచేయానికి సహాయకురాలి పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూపర్‌వైజర్లు రత్నమ్మ, శిల్ప కోరారు. సోమవారం ఆమె స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద పోస్టు వివరాల నోటిఫికేషన్‌ను అతికించారు. ఆమె మాట్లాడుతూ, కాంపాళెం దళితవాడలో ఎస్సీ, కాటూరులో ఓసీ, కాటూరు, ఆదిరెడ్డికండ్రిగ గ్రామాల్లోని ఓసీ కేటగిరి వారు ఆ పోస్టులకు అర్హులని తెలిపారు.

యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా వినాయక్



ఏర్పేడు: స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజరుగా వినాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మేనేజర్ మనోజ్‌కుమార్ తిరుపతికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తిరుపతి జోనల్ ఆఫీస్ నుంచి వినాయక్ ఇక్కడికి వచ్చారు. బ్యాంకు సిబ్బంది, పలువురు ఖాతాదారులు నూతన మేనేజర్‌ను శాలువలు, పూలమాలలతో సన్మానించారు.

మీ ప్రేమాభిమానాలు మరువలేను



పుష్పగుచ్ఛంతో ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెబుతున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని ఆశీర్వదించి సత్కరిస్తున్న వేదపండితులు

- అందరి ఆశీస్సులతో ప్రజాసేవలో మరింత ముందుకు వెళ్తాం
- జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు(రేణిగుంట): శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు చెప్పారు. వేదపండితులు ఆయనకు..మరెన్నో జన్మదినాలు జరుపుకుని ప్రజా సేవలో తరించాలని ఆశీర్వచనం పలికారు. అలాగే టీటీడీ పాలకమండలి సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి, విస్ టీవీ చైర్మన్ దేవనదాస్ యాదవ్, శ్రీకాళహస్తి ఆర్డీఓ కెఎస్ రామారావు, శ్రీకాళహస్తి ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు యాదవ్, అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సైతం పెదసంఖ్యలో వచ్చి ఎమ్మెల్యేను కలిశారు. తాము చేసిన కళాకృతులను ఆయనకు అందజేశారు. పలువురు జ్ఞాపికలతో సత్కరించారు. పలుచోట్ల సామాజిక సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించి సేవా స్ఫూర్తిని చాటారు. విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ, పేదలకు అన్నదానం, వైద్య శిబిరాలు నిర్వహించారు. తన వద్దకు నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున వచ్చిన జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన ప్రజలు, నాయకులు, కార్యకర్తల అభిమానం, సామాజిక సేవలను, ఎన్నటికీ మరువనని, తన మీద, పార్టీ మీద ఎంతటి ప్రేమ ఉందో చాటి చెప్పారని ఎమ్మెల్యే భావోద్వేగంతో చెప్పారు. అందరి ఆశీస్సులతో ప్రజాసేవలో మరింత ముందుకు వెళ్తానని ఆయన అన్నారు.



ఎమ్మెల్యేతో అంజూరు తారక శ్రీనివాసులు, ఉన్నం వాసుదేవనాయుడు తదితరులు



శ్రీకాళహస్తి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెబుతున్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

కల్లుగీత కార్మికునికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తొట్టంబేడు (రేణిగుంట): ఏర్పేడు మండలం కందాడకు చెందిన కల్లుగీత కార్మికుడు పాపయ్య ఆదివారం కల్లుగీస్తూ ప్రమాదవశాత్తు జారిపడి గాయపడ్డాడు. ఆయనకు వైద్యం కోసం తక్షణ సాయంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.10వేలు అందజేశారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పాపయ్య చికిత్స పొందుతున్నట్టు శ్రీకాళహస్తి ఎక్సైజ్ సీఐ మురళీమోహన్ చెప్పారు. విషయాన్ని జిల్లా ఎక్సైజ్ అధికారి జానకిరామ్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరఫున నిబంధనల మేరకు సాయం అందేలా చూస్తామని ఆయన తెలిపారు.



చికిత్స పొందుతున్న కల్లుగీత కార్మికుడు పాపయ్య

నాడు-నేడు పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న డీవైఈఓ రఘురామయ్య



హాజరైన ప్రధానోపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నాడు-నేడు రెండవ విడత పనులను వేగవంతం చేసి వేసవి సెలవుల్లోపు పూర్తి చేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి రఘురామయ్య ఆదేశించారు. సోమ వారం స్థానిక జెడ్పీ హైస్కూలు సమావేశపు మందిరంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో నాడు-నేడు పనులతో పాటు బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించడంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాడు-నేడు మొదటి విడతలో 27 పాఠశాలల్లో రూ. 5 కోట్లతో పనులు పూర్తయ్యాయన్నారు. అలా గే రెండవ విడతలో రూ.6 కోట్లతో 22 పాఠశాలల్లో పనులు వేగవంతం చేసి, జూన్ 12లోపు పూర్తి చేయాలన్నారు. నాడు-నేడు పనులతో పాఠశాలల భవనాల రూపురేఖలు మారి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నాయన్నారు. ఐదేళ్లు నిండిన పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. అనంతరం పదిలో ఫెయిలైన విద్యార్థుల ప్రత్యేక తరగతులను, ఎంఆర్సీ కార్యాలయంలోని యూనిఫాంను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని సోమవారం పార్లమెంట్ కమిటీ చైర్మన్ బాలసౌరి, తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

సత్యవేడు టీడీపీలో పోటీ పాదయాత్రలు!

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ హెలెన్‌కు వ్యతిరేకంగా జేడీఆర్ పాదయాత్ర
- అయోమయంలో పార్టీ శ్రేణులు

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన టీడీపీ శ్రేణుల పోటీ పాదయాత్ర సర్వత్రా చర్చనీయాంశమైంది. ఎవరి పక్షాన వెళ్లాలో తెలియక పార్టీ శ్రేణులు తర్జనభర్జన పడినట్లు సమాచారం. యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తయిన సందర్భంగా సత్యవేడు నియోజకవర్గంలో ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ హెలెన్ సత్యవేడు మండలం మదనంబేడు నుంచి సత్యవేడు గాంధీబొమ్మ మూడు రోడ్ల కూడలి వరకు పాదయాత్ర చేయాలని పిలుపునిచ్చారు.అయితే అదే సందర్భంలో గత సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన జేడీ రాజశేఖర్ సైతం నాగలాపురం నుంచి పిచ్చాటూరు వరకు పాదయాత్ర చేసేందుకు పోటీగా పిలుపునిచ్చారు. అయితే ఇరువర్గాలు అధిష్టానం దృష్టిలో పడేందుకు పోటాపోటీగా ఈ పాదయాత్రలు నిర్వహించారని పార్టీ శ్రేణుల్లోనే చర్చకు దారితీయడం గమనార్హం! జేడీ రాజశేఖర్ పాదయాత్రకు నియోజకవర్గం నుంచి, పార్టీ ముఖ్య నేతల నుంచి ఆదరణ లేకపోవడంతో తన సొంత ఖర్చుతో తృతీయ శ్రేణి నాయకులతో మమ అనిపించారు. అలాగే స్వపక్షపు పోటీ ప్రత్యర్థి కంటే ఎక్కువ జనాన్ని తరలించాలని ఆరాటపడిన డాక్టర్ హెలెన్ మండలాల వారీగా మండల అధ్యక్షులకు బాధ్యతలు అప్పగించి జనసమీకరణకు అష్టకష్టాలు పడి పాదయాత్ర పూర్తి చేశారు. అయితే దీనికి ఆశించిన స్థాయిలో ప్రజల నుంచి ఆదరణ కరువవడంతో పార్టీ శ్రేణులే పాదయాత్రకు దిక్కయ్యారు. కొంతకాలంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ హెలెన్‌కు వ్యతిరేకంగా జేడీఆర్ కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో ఇద్దరి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఫలితంగా ఎటువైపు వెళ్లాలో అర్థంకాని అయోమయ పరిస్థితుల్లో తెలుగు తమ్ముళ్లు కొట్టుమిట్టాడుతున్నారు.

మృతుని కుటుంబానికి బీమా సాయం



మృతుని భార్యకు బీమా సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తక్షణ సాయంగా వైఎస్ఆర్ బీమా నగదు రూ.10 వేలను అందజేశారు. నాగలాపురం ఈస్ట్ కాలనీకి చెందిన తులకానం ఆదివారం ఉదయం నందనం వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం మధ్యాహ్నం ఆ గ్రామానికి వెళ్లి మృతుని భార్య అమ్ములుకు బీమా సొమ్మును అందజేశారు. మిగిలిన మొత్తం త్వరలో అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పద్మజను ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అపరంజి రాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, వైఎస్ఆర్ టీయూసీ నియోజకవర్గ చైర్మన్ ఎస్ఎం సురేష్, కో-ఆప్షన్ సభ్యులు మునస్వామి, సచివాలయ మండల కన్వీనర్ మోహన్ మొదలి, నాయకులు మురళీ రెడ్డి, మహేష్, జేమ్స్, విమల్, రాజామణి తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

వరదయ్యపాళెం: మండలంలోని ముస్లింపాళెం గ్రామ పంచాయతీలో మంగళవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి తెలిపారు. అన్నిశాఖల మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



శ్రీధర్‌ను సన్మానిస్తున్న రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

రేణిగుంట: రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని రేణిగుంట రైల్వే పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు కోరారు. ఆల్ ఇండియా రైల్వే రిటైర్డ్ మెన్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు యస్.శ్రీధర్‌ను రేణిగుంట యూనియన్ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఫిక్స్‌డ్ మెడికల్ అలవెన్స్ ఇవ్వడం ఆపి వేసి రైల్వే పెన్షనర్లకు అన్ని వ్యాధులకు వైద్య సేవలు అందించేలా చూడాలని, యూఎంఐడీ కార్డులు వచ్చేలా చూడాలని, రైల్వే బోర్డు (న్యూఢిల్లీ) స్థాయి, జనరల్ మేనేజర్ స్థాయిలో చర్చించి రైల్వే పెన్షనర్ల సమస్యలకు సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. పెన్షన్ పే ఆర్డర్ ప్రతి పే కమిషన్ అమలు చేయాలన్నారు. పెన్షనర్ల సమస్యలు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని శ్రీధర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ చైర్మన్ వి.రామమూర్తి, రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ జయంత్ కుమార్, జాయింట్ సెక్రటరీ రంగయ్య, అసిస్టెంట్ సెక్రటరి ఆర్ఎస్ జ్ఞానశేఖర్, సి.చంద్రశేఖర్, జీవా ఆచారి, ఆర్.రవిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బీపీ అగ్రహారం గంగమ్మ జాతర





జాతరకు విద్యుత్ దీపాలంకరణ

తొట్టంబేడు(రేణిగుంట): శ్రీకాళహస్తి పట్టణంలోని బీపీ అగ్రహారం గంగమ్మ జాతరను బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం తెల్లవారు జామున గంగమ్మను ఊరేగించి నడివీధిలోని గంగమ్మ చావడి వద్ద ప్రతిష్ఠిస్తారు. జాతర జరిగే బీపీ అగ్రహారం, ఎఎం పుత్తూరు, ప్రాజెక్టువీధి, పానగల్ వార్డులలో శ్రీకాళహస్తి పురపాలక సంఘం ఆధ్వర్యంలో జోరుగా పారిశుధ్యం పనులు చేశారు. ఇక, గంగమ్మ చావడి చుట్టూ విద్యుత్ దీపకాంతులతో ఆకట్టుకునేలా వివిధ దేవతా మూర్తుల కటౌట్‌లతో ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణంలో పానగల్ సమీపంలోని పొన్నాలమ్మ దేవస్థానం వద్ద మంగళవారం మహిళలు పొంగళ్లు పెట్టనున్నారు. బుధవారం జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ భీమారావు ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ అంజూయాదవ్ పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

‘స్పందన’ వినతులు పరిష్కరించండి



మాట్లాడుతున్న తహసీల్దారు హనుమాన్‌నాయక్

బుచ్చినాయుడుకండ్రిగ: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందే వినతుల పరిష్కరించాలని తహసీల్దారు హనుమాన్‌నాయక్ ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో సిబ్బందికి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. సమావేశంలో డీటీ శివయ్య, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



చల్లంగా చూడు.. గంగమ్మ తల్లీ



గంగమ్మ ఆలయం వద్ద భక్తుల కోలాహలం

తిరుపతి కల్చరల్: కరుణ చూపి.. చల్లంగా చూడు గంగమ్మ తల్లీ అంటూ భక్తులు సోమవారం తాతయ్యగుంట గంగమ్మను వేడుకున్నారు. జాతరలో భాగంగా పెద్ద గంగమ్మ, చిన్నగంగమ్మకు ప్రతీకగా కైకాల కులస్తులు సోమవారం సున్నపు కుండల వేషాలు ధరించి నగరంలో తిరుగుతూ పూజలందుకున్నారు. ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేక అలంకరణలో కొలువుతీర్చారు. భక్తులు గంగ వేషాలతో పాటు వివిధ పౌరాణిక, జానపద వేషాలు వేసుకొని చిందులు వేస్తూ సందడి చేశారు. గంగమ్మ వివిధ వేషాల్లో తిరుగుతూ మహిళలను వేధిస్తున్న పాలెగాడిని సంహరించడం జాతర విశిష్టత. జాతర చాటు నుంచి బైరాగి వేషం మొదలు దొరవేషం వరకు విభిన్న వేషాలు ధరించిన అమ్మవారు పాలేగాడిని సంహరించి, మాతంగి వేషంతో ఓదార్పునిస్తుంది. ఇలా వారం రోజులు విభిన్న వేషాలతో అలసిన గంగమ్మను శాంతిపజేసేందుకు సంప్రదాయబద్ధంగా సోమవారం అర్ధరాత్రి అర్చకులు ప్రత్యేక అభిషేకం చేపట్టారు.

నేడు ‘పేరంటాల’ వేషం

జాతరలో భాగంగా మంగళవారం కైకాల కులస్తులు పేరంటాల వేషం ధరిస్తారు. ఎర్రడల్లచీర ధరించి తలకు నల్లని గుడ్డ కట్టి ఒడిబాలు కట్టుకుని బంగారంలా అట్టలతో చేసిన ఆభరణాలతో ముస్తాబైన పేరంటాలు పంబల వాయిద్యాతో చాటు మండపం వద్ద పూజలు చేసి నగరంలో పూజలు అందుకుంటారు. మంగళవారం వేకువజామున ఆలయానికి చేరుకుని చిన్నగంగమ్మ తర్వాత పెద్ద గంగమ్మ చెంపనరకడంతో జాతర సమాప్తమవుతుంది.

నేటి రాత్రి కొలువు తీరనున్న గంగమ్మ విశ్వరూప ప్రతిమ

తిరుపతి గంగజాతరలో భాగంగా చివరిరోజు రాత్రి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోని అమ్మవారి విశ్వరూప కొడి స్తంభంపై విశ్వరూప ప్రతిమను ఏర్పాటుచేస్తారు. కుమ్మరి, చాకలి, విశ్వబ్రాహ్మణ, కంసాలి, దళితులు, మంగళి, గొల్లవంటి అన్ని కులాల సమ్మేళనంతో భక్తి ప్రపత్తుల నడుమ భక్తులకు అమ్మవారి విశ్వరూప ప్రతిమ దర్శనం కలుగనుంది. చాటింపుతో ప్రారంభమైన వివిధ వేషాలు, మొక్కులు, వినోదాలు, వివిధ పూజలతో సాగి చిట్టచివర గంగమ్మ చెంప నరకడంతో జాతర ముగుస్తుంది.

భక్తులకు అన్నదానం

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని మాజీ ఎంపీపీ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. మేయర్ శిరీష ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వెయ్యి మంది భక్తులకు పులిహోర, పెరుగన్నం, పొంగళి, విజిటబుల్ బిర్యానీ, సాంబార్ అన్నం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ హేమాద్రి రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దత్తా గణేష్ యాదవ్, వెంకటేష్, కిరీటిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు